క్లుప్తంగా

క్రీడా ప్రాంగణాలకు కిట్లు పంపిణీ

చుంచుపల్లి: మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన కేసీఆర్ కిట్లను చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, జెడ్పీ సీటీసీ మెరుగు విద్యాలత బుధవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ మంద మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, సర్పంచులు మాలోత్ ధనలక్ష్మి, మోతి, పద్మ, కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు మోకాలడ్డుతున్న 'బీఆర్ఎస్'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్‌లు మోకాలడ్డుతున్నాయని, కార్మిక సంఘాలు యాజమాన్యానికి తొత్తుగా మారటం సిగ్గుచేటని వర్కర్స్ యూనియన్ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సంస్థలో గుర్తింపు సంఘంగా పనిచేసి తాజాగా ఉద్యోగ విరమణ పొందిన టీబీజీకేఎస్.. కార్మికుల సమస్యలను, సంస్థ మనుగడను విస్మరించిన ఈ సంఘాన్ని కార్మికులు నమ్మే పరిస్థితి లేదన్నారు. దేశవ్యాప్త బొగ్గుగని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12,13,14 తేదీల్లో 72 గంటల సమ్మె చేపడుతున్నామని అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రమేష్



ఇల్లెందురూరల్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా బట్టు రమేష్ బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు జర్పుల రాంచందర్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

'మధ్యాహ్న' కార్మికుల నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద బొడ్డెమ్మల పున్నమి సందర్భంగా బొడ్డెమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 16 రోజులకు చేరుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదని నాయకులు విమర్శించారు. విజయలక్ష్మి, పుష్ప, కృష్ణవేణి, ప్రభావతి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల బిక్షాటన

టేకులపల్లి: ఆశా వర్కర్లకు రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం పదో రోజుకు చేరింది. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆశా వర్కర్లు బిక్షాటన చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషకాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.5లక్షల ఇవ్వాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

ఇంటిపన్నులు నూరుశాతం వసూలు చేయాలి

చుంచుపల్లి: మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు నూరుశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ ఆదేశించారు. బుధవారం చుంచుపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశానికి హాజరై ప్రసంగించారు. సిబ్బంది జీతాలు, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్ బకాయిలను ప్రతీనెల 3 తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

టేకులపల్లి: 24 రోజుల నుంచి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను టేకులపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీలు చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో టేకులపల్లి పోలీసులు సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ సంఘాల నాయకులు కల్తి భద్రమ్మ, ఇందిర, పద్మ, మంగమ్మ, జ్యోతిలను తెల్లవారు జామున అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

జూలూరుపాడు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు ఏఐటీయూసీ, సీఐటీయూసీలు పిలుపునివ్వడంతో బుధవారం జూలూరుపాడులో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుత వాతావరణంలో ఆందోళనకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల చేత హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా లలిత, మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ రమాదేవి, విద్య, బేబి, సోనీ ఉన్నారు.

విషజ్వరాల విజృంభణ

ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట



జూలూరుపాడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

జూలూరుపాడు: మండల వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెల్లో జనం జలుబు, దగ్గు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, జ్వరంతో విలవిలాడుతున్నారు. వైరల్ ఫీవర్ (విషజ్వరం), టైఫాయిడ్‌తో బాధపడుతున్నారు. ఆగస్టులో ఎలాంటి జ్వరాలు నమోదు కానప్పటికీ ఒక్కసారిగా నెలరోజులుగా విష జ్వరాలు వ్యాప్తి చెందాయి. రెండు నెలలుగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఎండ తీవ్రత పెరగడంతోపాటు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తరుణంలో ప్రజలు విషజ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇంట్లో ఒకరికి జ్వరం వస్తే రెండు రోజుల్లో కుటుంబంలోని అందరూ జ్వరం బారిన పడుతున్నారు. దీంతో స్థానిక ప్రభుత్వాస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరబాధితులు క్యూ కడుతున్నారు. స్థానిక ప్రభుత్వాత్రికి రోజుకు 250 - 300 మంది వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. సాధారణంగా రోజుకు 60-80 మాత్రమే వస్తుంటారు. అన్ని గ్రామాల్లో ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీల వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది. మండలంలో ఇప్పటి వరకు రెండు డెంగీ కేసులు నమోదు కాగా, మలేరియా కేసులు నమోదు కాలేదు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ప్రస్తుతం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా కొనసాగుతోంది. అయితే నలుగురు డాక్టర్లకు గాను ప్రస్తుతం ఇద్దరు విధుల్లో ఉన్నారు. ఒక డాక్టర్ మంగపేట పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై వెళ్లగా మరో డెంటల్ డాక్టర్ కాంట్రాక్ట్ క్యాన్సిల్ అయింది.

అదేవిధంగా ఇటీవల హెడ్‌నర్సు, స్టాఫ్ నర్సు ప్రమోషన్‌పై వెళ్లడంతోపాటు, మరో స్టాఫ్ నర్సు సులానగర్ పీహెచ్‌కి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ప్రస్తుతం నలుగురు స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో డాక్టర్లు, వైద్యసిబ్బంది కొరత కారణంగా రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఒకరు ఆస్పత్రిలో ఓపీ చూస్తుంటే మరొకరు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోగుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకొని వైద్యులు, వైద్యసిబ్బంది ఖాళీలను భర్తీ చేసి మెరుగైన సేవలు అందేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మూడు నెలల నుంచి గ్రామాల్లో స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు కొనసాగిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ గ్రామాల్లో విష జ్వరాలు తగ్గుముఖం పట్టడం లేదు. పారిశుద్ధ్యంపై అధికారులు, గ్రామ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రోగాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్ఎం

ఇంట్లో అందరికీ జ్వరం వచ్చింది



ఇంట్లో వారందరికీ జ్వరం వచ్చింది. ఒకరి తరువాత ఒకరు జ్వరాల బారిన పడ్డాం. వారం, పది రోజులు పాటు జ్వరంతోపాటు, జలుబు, దగ్గుతో బాధపడుతున్నాం. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాం.

– సపావట్ లక్ష్మి, గోపా తండా

పారిశుద్ధ్య సమస్యలతోనే..



జలుబు, దగ్గు, తలనొప్పి, తీవ్రమైన ఒళ్లు నొప్పుల తోపాటు జ్వరం వచ్చింది. ఐదు రోజుల నుంచి బాధపడుతున్నాను. దోమలు విపరీతంగా ఉన్నాయి. గ్రామంలో సర్పంచ్ పారిశుద్ధ్యం పనులు చేయించాలి.

– అంగోత వసంత, దండుమిట్ట తండా

వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నాం



జ్వరాల నియంత్రణ కోసం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడంతోపాటు, ఇంటింటి జ్వర సర్వే కూడా చేపడుతున్నాం. మండలంలో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయి. వైద్యసిబ్బందితో మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ రాకేష్ కుమార్, జూలూరుపాడు పీహెచ్‌సీ

ఈ-పంచాయతీ ఆపరేటర్లకు సంఘీభావం

చుంచుపల్లి: తెలంగాణ ఈ-పంచాయతీ టెక్నికల్ వింగ్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న ఈ- పంచాయతీ ఆపరేటర్ల శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి రాజశేఖర్, విక్రమ్, కిషోర్, క్రాంతి, కిరణ్‌కుమార్, అరవింద్, రవి, చంద్రకళ, అనిషా, సతీష్, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అందరికీ న్యాయం

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. బాలాజీనగర్ గ్రామపంచాయతీలో బుధవారం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పులి సైదులు, పాయం స్వాతి, తాటి చుక్కమ్మ, కల్తి పద్మ, పాయం లలిత తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి 30 శాతానికి పెంచండి




ధర్నా చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): న్యాయపరమైన ఆటంకాలు తొలగించి ఎస్‌జీటీ, భాషా పండితులు, పీఈటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఇవ్వాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 5 నుంచి 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకేశ్వరరావు, బి.రవి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లేకుండానే బదిలీల షెడ్యూల్ ప్రకటించడం అన్యాయమన్నారు. కేవలం బదిలీలు చేపడితే సీనియర్ ఉపాధ్యాయులు ప్రమోషన్ తీసుకోకుండా రిటైర్డ్ అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ కూడా రిలీవర్లు లేక బదిలీ స్థానానికి వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

కంపెనీ స్థాయి క్రీడలు ప్రారంభం

ఇల్లెందు: సింగరేణి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్‌లో బుధవారం క్రీడా పోటీలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ప్రారంభించారు. మాట్లాడుతూ.. కంపెనీ బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యోగుల పని ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. తొలుత ఒలింపిక్ జెండాను ఎగురవేసి ఆరు రీజియన్ల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాసు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, యూనియన్ నాయకులు ఎస్.రంగనాథ్, నజీర్ అహ్మద్, జగన్నాథం, బాలప్రసాద్, సిరాజ్ అహ్మద్, సీతారామయ్య, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పాస్నేట్, జాన్ వేస్లీ, రమేష్, అశోక్, శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, సాయి స్వరూప్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న 104 ఉద్యోగులు

నవభారత్: తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష బుధవారం ప్రారంభించారు. ఉద్యోగులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 104 ఉద్యోగులు 2008 నుంచి డీఎస్సీ ద్వారా రోల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పద్ధతిలో జీఓ 1636 మెమో నంబర్ 20639 ప్రకారం ప్రభుత్వాధీనంలోనే 1350 మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు. 15 ఏళ్లగా ఉద్యోగ భద్రత లేకపోయినా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో వాహనాలను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసినప్పుడు ఉద్యోగ భద్రత కలిపిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కరోనా సమయాల్లో కూడా సేవలందిచామని పేర్కొన్నారు. రెగ్యూలరైజేషన్‌కు అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఉద్యోగులకు వేతనాల చెల్లింపు ఏజెన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు పరిష్కరించాలి



సమస్యలు వివరిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాపంథా అనుబంధ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో బుధవారం సర్వే నిర్వహించారు. సర్వేలో గుర్తించిన అంశాలను ఆస్పత్రి వైద్యాధికారికి పీఓడబ్ల్యూ నాయకులు చంద్ర అరుణ, సావిత్రి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లెందులో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రూ.37.50 కోట్లు మంజూరయ్యాయని చెప్పిన పాలకులు పనులు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. ఏడాదికాలంగా ఆస్పత్రిలో మందుల కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. కనీసం మంచినీటి వసతి, ఇంటర్నల్ డ్రెయినేజీ వంటి వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఆస్పత్రి గురించి గొప్పలు చెపుకుంటున్న పాలకులు కనీసం వైద్యాధికారుల నియామకం చేపట్టకపోవడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ముత్తక్క, పార్వతి, కుమారి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని శ్రీపాండురంగ భజన మందిరం ఆలయానికి చెందిన షాపుకు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణం రైతు బజార్ పక్కనున్న షాపు నంబర్ 5-8-151 మూడేళ్లపాటు కిరాయికి ఇచ్చేందుకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నామని రూ.20 వేలు డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): ఏళ్ల తరబడి దరఖాస్తులు చేసుకొని ఎదురు చూస్తున్న పేదలందరికీ వితంతు, వృద్ధాప్య, వికలాంగ, ఒంటరి మహిళా పింఛన్లు, రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుచ్చిరాములు, జ్ఞానయ్య, కత్తెర రవీందర్, గద్దం రాజయ్య, అనంతగిరి అంజయ్య, దాసరి జ్యోతి, లక్ష్మి, రఘు, ఖాదర్, రమేష్, మోహన్‌రావు, చంద్రమౌళి, సత్యనారాయణ, నాగమణి, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీపీఈ గైడ్‌లైన్స్ సవరించాలి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డీపీఈ) గైడ్‌లైన్స్ సవరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం డీపీఈ గైడ్‌లైన్స్‌ను సవరించకుండా, 11వ వేతన ఒప్పందం చేసి పెరిగిన వేతనాలు చెల్లించకుండా కోలిండియా పరిధిలోని బొగ్గు గని కార్మికుల వేతనాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. జాతీయ సంఘాలు తలపెట్టిన సమ్మెకు సింగరేణి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సుజాతనగర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా, మరోవ్యక్తి పరారయ్యాడు. రూ.1800 నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమేశ్వర్ తెలిపారు.

'గృహలక్ష్మి' వర్తింపజేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రామవరానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ఇదే గ్రామానికి గృహలక్ష్మి పథకానికి అర్హత లేకపోవటం విచారకరం అని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ అన్నారు. స్థానికంగా బుధవారం జరిగిన మహిళా సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీ ఒకటే, చట్టాలు రెండు అంటూ రామవరం ప్రాంతం 1/70, సింగరేణి ల్యాండ్ అంటూ అధికారులు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఒక్కటే అయినప్పుడు రెండు చట్టాలు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు రామవరం ప్రజల ఆవేదనను దృష్టిలో పెట్టుకొని రామవరం ప్రాంతానికి ఎలాంటి నిబంధనలు లేకుండా గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



పాల్వంచ: క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

పాల్వంచ: యువత క్రీడల్లో రాణించాలని, అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకోవాలని, అందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ప్రభుత్వం నుంచి వచ్చిన క్రీడా సామగ్రిని (కిట్లు) యువకులకు అందజేశారు. వనమా మాట్లాడుతూ.. క్రీడలపై యువత మక్కువ పెంచుకోవాలని, చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. నియోజకవర్గ సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ అప్పారావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వాసుదేవరావు, ఎంపీపీ మడివి సరస్వతి, వైస్ ఎంపీపీ మార్గం గురవయ్య, బీఆర్ఎస్ నాయకులు మంతపురి రాజుగౌడ్, ఆచార్యులు, పూసల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

పాల్వంచరూరల్: సంగం గ్రామం నుంచి సంగం గట్టు గ్రామం వరకు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. పల్లెప్రాంత ప్రజలకు ప్రభుత్వం అన్ని రకాల అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రజలకు రహదారి లేక అనేక ఇబ్బందులు పడినట్లు చెప్పారు. పక్కన మొర్రేడు వాగుపై బ్రిడ్జి లేక దంతలబోరు, సంగం ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే వాగులో నుంచి ఇబ్బందులు పడుకుంటూ వచ్చేవారన్నారు. రహదారులు, గోదావరి జలాల ద్వారా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా పల్లెప్రాంతాల రూపురేఖలు మారిపోయాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.అప్పారావు, డీఈ సత్యనారాయణ, ఏఈ అనిల్‌కుమార్, కొత్వాల శ్రీనివాసరావు, బరపటి వాసుదేవరావు, మడివి సరస్వతి, మక్బూల్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి, దసరా కానుకల పంపిణీ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, ప్రజాప్రతినిధులు

ఇల్లెందురూరల్: పల్లెల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకుంటూ యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆకాంక్షించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని 50 క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి, మహిళలకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా తమకు ఇష్టమైన ఆటలలో సాధన చేసేందుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం మహిళలకు దసరా కానుకలను అందేశారు. దిండిగల రాజేందర్, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వాంకుడోత్ ఉమాదేవి, జనగం కోటేశ్వరరావు, దాస్యం ప్రమోద్‌కుమార్, ఘాజీ, బాలరాజు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

హరిప్రియకు సన్మానం

ఇల్లెందు: ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి హరిప్రియకు అవకాశం ఇవ్వడాన్ని హర్షిస్తూ బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియను బుధవారం ఘనంగా సన్మానించారు. మాట్లాడుతూ.. న్యాయవాదులకు ఇంటి స్థలాలు కేటాయించేలా సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, బీఆర్ఎస్ లీగల్‌సెల్ అధ్యక్షుడు వరాల నర్సింహారావు, కార్యదర్శి కీర్తి కార్తీక్, ప్రభుత్వ న్యాయవాది కలవల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం పట్టణంలో ర్యాలీ నిర్వహించి క్యాంపు కార్యాలయం ముట్టడించింది. నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు.

ఫొటోగ్రాఫర్స్ ఎక్స్‌పో పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందు: ఈ నెల 6,7, 8 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్స్ ఎక్స్‌పో పోస్టర్లను ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టెక్నాలజీ పెరిగే కొద్దీ ఫొటో గ్రాఫర్స్ ప్రతి టెక్నాలజీలో అభివృద్ధి చెందాలన్నారు. ఎక్స్‌పో ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకొని ఆచరణలో పెట్టేందుకు కృషి చేయాలన్నారు. నవ్య, మీనా, రేఖ, రేణుక, మారుతి ప్రకాష్, అనిల్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాచినేనిపేటతండాలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

జూలూరుపాడు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాకర్లలో రూ.1.48 లక్షలు, మాచినేనిపేటతండాలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లోని క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రితోపాటు, బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన జీపీల్లో కూడా క్రీడా ప్రాంగణాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి, కేటాయించాలని తహసీల్దార్‌ను ఎమ్మెల్యే రాములు నాయక్ ఆదేశించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను మహిళలు, యువతులు ఆనందంగా జరుపుకోవాలన్నారు. మహిళలు, యువతులకు ఎమ్మెల్యే బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఐదుగురు లబ్ధిదారులకు రూ.2.10 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో లావుడ్యా సోనీ, భూక్యా కళావతి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, మండల స్పెషలాఫీసర్ భీమా నాయక్, పీఆర్ ఏఈ నాగేందర్, ఎంపీఓ తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం...

జూలూరుపాడు: వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా బుధవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన బతుకమ్మ చీరల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే రాములు నాయక్‌కు ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూనెం ఝాన్సీ, నీలిమ, లక్ష్మి, దేవని, వసుంధర, రామ్నీ, భీమ్లీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులను పట్టించుకోని 'సింగరేణి'

ఇల్లెందు: జీఓ ఎంఎస్ నంబర్ 424 ప్రకారం సింగరేణిలో భూములు కోల్పోయిన తమకు సింగరేణిలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి 30 ఏళ్లు గడిచినా ఉద్యోగ అవకాశం ఇవ్వకుండా తమకు అన్యాయం చేస్తున్నారని సింగరేణి భూనిర్వాసితులు వాపోయారు. ఉద్యోగాల విషయంలో గతంలో ఉద్యమించి విజయం సాధించిన మహాశక్తి ఆర్గనైజేషన్ ప్రతినిధులు దిలీప్, సంతోష్‌పాసి, మహేష్‌కోరిలను ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన సింగరేణి భూనిర్వాసితులు బుధవారం కలిసి తమ ఆవేదన వినిపించారు. తాము భూములు కోల్పోయి దశాబ్దాలు గుడుస్తున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని వాపోయారు. తమకు కూడా ఉద్యోగాలు వచ్చేందుకు మహాశక్తి ఆర్గనైజేషన్ సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉండం రమేష్, హరిబాబు, చంద్రకాంత్, వెంకటేష్, అశోక్, లక్ష్మీనారాయణ, నాగరాజు, కోటేశ్వరరావు, అజయ్, నాగేశ్వరరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది, విద్యార్థులు

జూలూరుపాడు: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎఫ్ఆర్ఓ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ... అడవుల్లో స్వేచ్ఛగా సంచరించే వన్యప్రాణులను బతకనివ్వాలన్నారు. అడవులను నరకడం వల్ల పర్యావరణానికి హానికరమన్నారు. అడవులు పచ్చగా ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం గుండెపుడి హైస్కూల్ విద్యార్థులను బస్సులో కనకగిరి రిజర్వ్ ఫారెస్టుకు తీసుకెళ్లి చూపించారు. ప్లాంటేషన్, జంతువుల కోసం నిర్మించిన నీటి తొట్లు, అడవుల అభివృద్ధికి అటవీశాఖ తీసుకుంటున్న చర్యలను అటవీ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో జూలూరుపాడు హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, డీఆర్ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, ఎఫ్‌బీఓలు బి.నరసింహారావు, కిషన్, వెంకటేశ్వర్లు, ఎస్కే రహీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.